సీరియల్

అడుగు ముందుకు వేస్తే భస్మం

వసుంధర

(గతసంచిక తరువాయి)

ఆ ప్రాంతంలో ఒక ప్రవేశద్వారం ఉంది. ద్వారం వద్ద ఇద్దరు మహా కాయులైన ఆటవికులు కాపలాగా ఉన్నారు. కొత్త మనుషులను చూసి వాళ్ళిద్దరూ ముందుకు వచ్చారు. వాళ్ళు పెదవివిప్పి మాట్లాడక పోయినా చూపుల్లో చాలా ప్రశ్నలు కనబడుతున్నాయి.

'వీళ్లు మన మిత్రులు. గంగాపురం ప్రెసిడెంటు పంపించాడు–" అని చెప్పాడు లక్ష్మణుడు. కాపలా వాళ్ళిద్దరూ వాళ్ళను లోపలకు వెళ్ళనిచ్చారు.

గురువులు ఆశ్చర్యంగా ఆ ప్రాంతాన్ని తిలకిస్తు

న్నాడు. పచ్చని చెట్లమధ్యన గుడిసెలు. గుడిసెల మీద లతలు. నార బట్టలు, జంతుచర్మాలతో పాటు మామూలు బట్టలు ధరించిన మనుషులు కూడా ఆ ప్రాంతంలో తిరుగుతున్నారు. అందరూ దృఢంగా ఉన్నారు. ఆరోగ్యంగా అగుపడు తున్నారు. ప్రకృతి సహజమైన ఆహారం తినడం అందుకు కారణం కావచ్చును.

మామూలు అరణ్యాలకీ ఆ ప్రాంతాలకీ తేడాఉంది. చూస్తూంటే నగరాలు కూడా ఈ పద్ధతిలో కడితే ఎంతో బాగుంటుందని గురువులుకు తోచింది.

లక్ష్మణుడు ఒక గుడిసెముందు ఆగాడు. అది చాలా పెద్ద గుడిసె. గుడిసెముందు ఎత్తైన అరుగులున్నాయి.

"ఇది మా నాయకుడి ఇల్లు. ఎవరు నాయకుడైతే వాళ్ళ ఇంట్లో ఉంటారు-" అన్నాడు లక్ష్మణుడు. లక్ష్మణుడా ఇంటికి వచ్చేముందు తన్ను పలకరించిన కొంత మందితో మాట్లాడాడు.

"అంటే ఇది రాజ్‌భవన్ లాంటిదన్న మాట!" అన్నాడు రామం.

నాయకుడి ఇంటిముందు అందమైన ముగ్గులున్నాయి. అరుగులకు అందమైన రంగులున్నాయి. అలంకరణ తమాషాగా వుంది. లక్ష్మణుడు మెట్లు ఎక్కి తలుపు తట్టాడు.

దృఢంగా ఉన్న ఓ ఆటవికుడు తలుపులు తీశాడు. లక్ష్మణుడు గురువుల్ని, రామూన్నీ పిలిచి- 'ఈయనే మా నాయకుడు!' అని చెప్పాడు.

ఇద్దరూ నమస్కరించారు. గోపీ, శంకరం తాము

కూడా ముందుకువచ్చి ఆటవికునికి నమస్కరించారు. ఆటవికుడు ముద్దుగా వారి తలమీద చేయి పెట్టాడు.

'విశేషాలు చెప్పు' అన్నాడు నాయకుడు, లక్ష్మణుడి వంక తిరిగి.

"వీరిని గంగాపురం ప్రెసిడెంటుగారు పంపారు. మన మిత్రులు ...." అన్నాడు లక్ష్మణుడు.

"అలాగా!" అని తలపంకించి– "ఈ పిల్లలెందుకు వచ్చారు!" అన్నాడు నాయకుడు.

"మన ప్రాంతాలు చూడాలని మనసుపడితే తీసుకుని వచ్చాను. ఇతను గంగాపురం ప్రెసిడెంటు మనవడు శంకరం, ఇతను గంగాపురం కరణం మనవడు గోపి–" అన్నాడు లక్ష్మణుడు.

"అయితే వాళ్ళకు గూడెం చూపించు...." అన్నాడు నాయకుడు. అది ఆజ్ఞగా భావించి ఆ పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయాడు లక్ష్మణుడు.

'కూర్చోండి' అన్నాడు నాయకుడు.

అంతా అరుగులమీద కూర్చున్నారు. అప్పుడు గురువులు తన దగ్గరున్న కాగితాన్నితీసి నాయకుడికిచ్చాడు. దానిమీద గురువులు, రామంల ఫొటోలు అతికించి ఉన్నాయి. క్రింద మిత్రులుగా వాళ్ళను పరిచయం చేస్తూ రాసిన వాక్యాలున్నాయి. ఆ క్రింద ఊరిపెద్దల సంతకాలున్నాయి.

ఆటవిక నాయకుడు వారిద్దరి వంకా ఆ ఫోటోల వంకా మార్చి మార్చి చూశాడు. తర్వాత లేచి నిలబడి— "ఇప్పుడే వస్తాముండండి!" అంటూ లోపలకు వెళ్ళాడు. రెండు నిమిషాల్లో వెనక్కి తిరిగి వచ్చి–'మిమ్మల్ని మా

అతిధులుగా స్వీకరిస్తున్నాను....' అన్నాడు.

'అపూర్వనిధికి దారి తెలుసుకుందా మని వచ్చా....' అన్నాడు గురువులు.

"ఆ విషయం ఆతిధ్యం అయ్యేక మాట్లాడుకుందాం. ఈ రాత్రితో కలిసి మొత్తం మూడు రాత్రులు మా గూడెంలో మీకు మరపురాని ఆతిధ్యం ఇవ్వబడుతుంది-' అన్నాడు నాయకుడు.

రామం గుండెలు దడదడలాడాయి. తాతయ్య చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. ఆయనకు ఇదే విధంగా మూడు రాత్రుల ఆతిధ్యం ఇవ్వబడింది. తరువాత....

"తరువాత....?" అనడిగాడు గురువులు.

"మేము చేయబోయేది ముందుగా చెప్పం! మా గూడెం లోకి ప్రవేశించిన వారు మా ఆచారాలను పాటించా ల్సిందే-సకల మర్యాదలతో మీకు అతిధ్యాన్ని ఇవ్వడం మా బాధ్యత....' అన్నాడు నాయకుడు.

గురువులు కూ్కా అనుమానం వచ్చింది. తమకు కూడా రామేశానికి జరిగినట్లే జరుగదు గదా! కానీ అలా జరగడానికి వీల్లేదు.

గంగాపురం నుంచి తాను తీసుకవచ్చిన కాగితం మీద స్పష్టంగా మిత్రులమని రాయించాడు. మిత్రులనూ, శత్రు వులనూ కూడా ఒకేరకంగా ఆతిధ్యమివ్వడం ఈ అటవి కుల ప్రత్యేకత అయుండవచ్చు.

'ఆ చిన్న పిల్లలిద్దర్నీ మేముగంగాపురం పంపిస్తాము. వారి గురించి మీకు చింత అవసరంలేదు-' అన్నాడు నాయకుడు.

* * *

'అందానికి నిర్వచనం నువ్వు. నువ్వు గనుక మా నగరం వస్తే....' అన్నాడు గురువులు. అతడింకా మాట్లాడకుండనే అతని నోరు మూసిందామె.

'ఏం?' అన్నాడతను.

"మాకు నగరాలంటే భయం. అక్కడి కృత్రిమ జీవితం గురించి చాలా విన్నాం-" అందామె కంగారుగా.

గురువులు నవ్వి-"నీ పేరు?" అన్నాడు.

"మలయ।" అందామె.

'నగరంలో కృత్రిమ వాతావరణమన్నమాట నిజమే। కానీ ఆ జీవితం కూడా ఎంతో బాగుంటుంది. చూడ్డానికిష్టం లేక పోయినా వినడానికి భయపడాల్సిన విషయం కాదది' -అంటూ గురువులా యువతికి నగరంలోని విశేషాల గురించి చెప్పాడు.

నగరవాసులకున్న ఒకొక్క వసుపాయం గురించే అతను చెబుతూంటే ఆమె విని ఆశ్చర్యపడి- "మేమనుకునే స్వర్గంలో ఇవన్నీ ఉంటాయి. నగరాల్లో ఇవన్నీ ఉంటాయంటే నేను నమ్మలేను....' అంది.

"అవన్నీ ఉండడంలో స్వర్గం లేదని నగర జీవితం తెలియజేస్తుంది-"అన్నాడు గురువులు తన జీవితాన్ని తలచుకుంటూ.

అతను మలయా నుంచి అటవికులకు సంబంధించిన చాలా విశేషాలడిగి తెలుసుకున్నాడు. రామేశం చెప్పిన విశేషాలతో అవన్నీ సరిపోయాయి.

'వృధా ప్రశ్నలతో కాలయాపన చేయవద్దు. జీవితం హాయిగా అనుభవించు-' అంది మలయ, గురువులుతో.

'ఎందుకనీ?'

'బ్రతికున్నన్నాళ్ళే కదా సుఖాలు !' అంది మలయ.

'నీకు చాలా ఆయుష్షు ఉంది-' అన్నాడు గురువులు.

"నీ ఆయుష్షు సంగతి నీ కంటే నాకే బాగా తెలుసు' అంది మలయ.

గురువులు ఉలిక్కిపడి - "నీ మాటలకు అర్థం ?" అన్నాడు.

"ఇప్పుడు చెప్పను. మూడో రాత్రి చెబుతాను...." అంది మలయ.

"ఇప్పుడే చెప్పాలి !" అన్నాడు గురువులు.

'అలా కుదరదు. నాతో గడిపినంతకాలమూ నువ్వు సంతోషంగా ఉండాలి. అందుకే ఆఖరు రాత్రి చెబుతాను" అంది మలయ.

' ఇప్పుడు చెప్పకపోతే నాకు చాలా విచారంగా ఉంటుంది. చెబితే నాకు సంతోషం కలుగుతుంది !" అన్నాడు గురువులు.

"నేను చెప్పబోయేది నీకు సంతోషం కలిగించే విషయం కాదు....

"మీ వాళ్ళు నన్ను ఏ దేవతకైనా బలిఇస్తారా ?"

"అలాగని ఎందుకనుకుంటున్నావు ?" అంది మలయ

"ఆటవికుల్లో ఇలాంటివుంటాయని విన్నాను...."

"తప్పు చేసిన వాళ్ళ విషయంలో తప్ప ఇంకెవ్వరి శరీరం నుంచీ రక్తం చిందడాన్ని మా జాతి సహించదు, అంది మలయ.

'అయితే!' అని ఆగి పోయాడు గురువులు. మృత్యు లోయ సంగతి తనకు తెలుసు నన్న విషయం ఆమెకు తెలియజేయడం ప్రమాదం అనిపించింపతనికి. రామేశం

తప్పించుకుని తన మనషులను పంపించేదని తెలిస్తే వాళ్ల తనని బ్రతకనివ్వరు.

'ఏదో అడగబోయి మానేశావ్!' అంది మలయ.

"ఏమిలేదు. నేను మీ మిత్రుణ్ణి. మిత్రులకు ఆతిథ్యం ఇచ్చేక మీ జాతి ఏం చేస్తుందో తెలియకుండా వుంది...." అన్నాడు గురువులు.

'నువ్వు మా అతిధివి. కానీ మిత్రుడివి కాదు." అంది మలయ.

గురువులు మళ్ళీ ఉలిక్కిపడ్డాడు. ఆమె మాటలో అర్ధమేమిటి? గంగాపురం ప్రెసిడెంటు తన విషయంలో ఏమైనా మోసం చేశాడా?

చేస్తే ఎలాచేశాడు? అప్పుడు గురువులుకు ఆటవికుడైన లక్ష్మణుడి విషయం గుర్తుకు వచ్చింది.

'మలయా! నేనో ప్రశ్న అడుగుతాను. వాయిదా అడక్కుండ జవాబు చెప్పాలి!"

'చెబుతాను. కానీ మూడ్రోజుల తర్వాత నువ్వేమవుతావని మాత్రం ఇప్పుడడక్కు"

"అది కాదు.... గంగాపురం ప్రెసిడెంటు స్నేహితుణ్ణి నేను. ఆయన నన్నిక్కడకు పంపాడు. నువ్వన్న మాటల్ని బట్టి నాకెప్పుడో అనుమానం కలుగు తోంది. లక్ష్మణుడు నీ మనిషి కదా- ఎదురుగా మిత్రుడని చెప్పి తర్వాత మేము మిత్రులము కాదనీ శత్రువులమనీ చెప్పి ఉండవచ్చు..."

మలయ నవ్వి-'మా ఆటవికుల సంగతి మీకు తెలియదు. మాకు రెండు మాటలుండవు. లక్ష్మణుడు మీ ఎదుట ఒక మాటా చాటుగా ఒక మాటా చెప్పేడు. అతడుగనుక మీరు

మాకు మిత్రులని నాయకుడికి చెప్పివుంటే నిజంగావే మీరు మాకు మిత్రులని అర్థం! ఆ నమ్మకం కోసమే మీతో పాటు లక్ష్మణుడిని పంపి వుండాలి...కానీ" అని ఆగిపోయింది.

'కానీ....?' అన్నాడు గురువులు కుతూహలంగా.

"లక్ష్మణుడు మీరు ఎదురుగా ఉండగా నాయకుడికి మీరు మిత్రులని చెప్పాడా? అతను ఏం చెప్పాడో బాగా గుర్తు చేసుకోండి-' అంది మలయ.

"మిత్రులమనే చెప్పాడు" అన్నాడు గురువులు నిశ్చయంగా.

"అయితే నిస్సందేహంగా మీరుమాకు మిత్రులయ్యుండాలి.... కానీ....'

"మళ్ళీ కానీ ఏమిటి?" అన్నాడు గురువులు.

"మిత్రులకిచ్చే ఆతిథ్యం ఇలా ఉండదు!'' అంది మలయ.

'మరి....?' అన్నాడు గురువులు.

'నన్నింకేమీ అడగొద్దు....' అంది మలయ.

గురువులు తీవ్రాలోచనలో పడ్డాడు. లక్ష్మణుడు నాయకుడికి చెప్పినమాటలు సూటిగానే ఉన్నాయి. అతనిలో మోసంలేని పక్షంలో తను ఆటవికులకు శత్రువుగా ఎలా గుర్తించబడతాడు? మలయ పొరబడుతోందా?

జీవితం సుఖంగా గడిచిపోయింది అక్కడున్నంత కాలమూ. మూడోరాత్రి అతను మలయను అసలు విషయం చెప్పమని అడిగాడు.

'నిన్నూ, నీ మిత్రుణ్ణీ మృత్యులోయలోకి పంపుతారు- రేపు ఉదయం.....'

గురువులు గుండె ఓ క్షణంపాటు ఆగిపోయింది-
'అంటే.... నేనుమీకు మిత్రుణ్ణి కాదన్న మాటా?'
అన్నాడు.

'కాదు. గంగాపురం ప్రెసిడెంటు ముందే మీఫొటో
లిచ్చి ఓ మనిషి ద్వారా సమాచారం పంపించాడు. మీరు
గంగాపురానికి పీడగా తయారయ్యారట. అటవిక
ప్రాంతానికి దారి చెప్పమని వాళ్ళ ప్రాణాలు తోడేస్తున్నా
రుట. గత్యంతరం లేని పరిస్థితుల్లో దారి చెప్పాల్సి
వచ్చిందనీ- మిమ్మల్నేదో విధంగా అంతంచేయమనీ
ఆయన సమాచారం పంపాడు. తను లక్ష్మణుడి ద్వారా
పంపే సమాచారం గత్యంతరంలేని పరిస్థితుల్లో పంపు
తున్నదని కబురంపాడాయన....' అంది మలయ.

తమ ఫొటోలు చూడగానే అటవిక నాయకుడు లోప
లకు వెళ్ళిరావడం గుర్తువచ్చింది గురువులుకు. అయితే
అంతేజరిగి ఉంటుంది! ఇప్పుడేంచేయాలి?

'మృత్యులోయ అంటే ఏమిటి?'

మలయ వివరించింది.

'తప్పించుకునే అవకాశాలేమైనా ఉన్నాయా?'
అన్నాడు గురువులు.

'ఏమీలేవు....' అంది మలయ.

'రహస్యద్వారాలేమీ ఉండవా?' అన్నాడు గురువులు
ఆశగా ఆమె వంకచూస్తూ-

'ఉండవు-' అని ఓ క్షణం ఆగి - "ఎలాగూ చని
పోతావు కాబట్టి ఓ రహస్యం చెబుతాను. మృత్యులోయకు
ఒక ద్వారం ఉంది. దాన్ని మృత్యులోయలోంచి తెరవ
డం ఎవ్వరికీ సాధ్యపడదు. బయట్నుంచి మా వాళ్ళ

ఏడాదికో పర్యాయం తెరుస్తూంటారు. మృత్యులోయ లోంచి బయటపడడానికి అదొక్కటే అవకాశం. ఆ అవకాశం కూడా మీకు లేదు. వారం రోజుల క్రితమే ఆ ద్వారం తెరిచి మూసేయడం జరిగింది-మళ్ళీ ఏడాదిదాకా అది తెరుచుకోదు-' అంది మలయ.

గురువులు శరీరం చల్లబడినట్లయింది. 'తప్పించుకోడానికింకేదైనా మార్గముందా?' అనడిగాడు.

'మృత్యులోయ నుంచి తప్పించుకోడానికింకే మార్గాలూ లేవు....' అంది మలయ.

'మృత్యులోయ నుంచి కాదు. ఈ గూడెం నుంచి....' అన్నాడు గురువులు.

మలయ నవ్వి-'ఈ గూడెం నుంచి తప్పించుకోవడం ఆ దేవుడిక్కూడా సాధ్యపడదు. గుడిపై చుట్టూ పటిష్టమైన కాపలా ఉంది.గూడెంలో మేటి విలుకాళ్ళున్నారు. ఎగురుతున్న పక్షిని కూడా గురిచూసి కొట్టగల సమర్థులు వాళ్ళు....' అంది.

గురువులు బాగా ఆలోచించాడు. ఏదో దైవశక్తి సాయపడితే తప్ప తను బ్రతికి బయటపడే అవకాశం లేదు. గంగాపురం ప్రెసిడెంటు గట్టివాడు. మొత్తానికి తన మీద చావు దెబ్బ తీశాడు.

గురువులు మలయ వంక చూసి-'మలయా! నామీద నీకు ప్రేమలేదా! నువ్వునన్ను రక్షించలేవా?' అనడిగాడు.

'నువ్వలా నీళ్ళు కారిపోతుంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. నీ గురించి చాలా విన్నాను. నీకసలు భయమేలేదనీ-ఎలాంటి ఇబ్బందినుంచైనా బయటపడ గల శక్తి సామర్థ్యాలు నీకున్నాయనీ విన్నాను....'

'ఎవరు చెప్పారు?'

'నాయకుడు....' అంది మలయ-

'అయితే నా అంతం సమీపించిందన్న మాట!'

'అవును - సమీపించింది. కానీ నీలో నేను విన్న ధైర్యం కనబడ్డం లేదు....'

'నాకు ధైర్యముంది కానీ అది నాకు వివేకం ప్రసాదించిన ధైర్యం. నిప్పుల మంటల్లో దూకమంటే ప్రాణాలతో బయట పడగలననుకునే అవివేకం నాకు లేదు-నా శక్తి, తెలివి తేటలు ఇంతవరకూ నన్ను కాపాడాయి. ఇక మీదట అవి నన్ను కాపాడలేవని తెలిసి నాధైర్యం నన్ను వదిలిపెడుతోంది-'

"అలాంటప్పుడు ఇక్కడికెందుకొచ్చావ్ ?"

'నా ధైర్యం నన్నిక్కడకు రప్పించింది...'

'నీ ధైర్యం నిన్ను మృత్యులోయలోకి నడిపిస్తోంది.' అని నవ్వింది మలయ.

"మలయా-నా ఆశ నువ్వే! నువ్వే నన్ను రక్షించాలి...." అన్నాడు గురువులు.

'ఇప్పటికిలా నన్ను చాలామంది అడిగారు. ఇందులో నేను చేయగలిగినదేమీ లేదు నీ ఆత్మ శాంతికి భగవంతుణ్ని ప్రార్థించడం తప్ప!' అంది మలయ.

గురువులు భారంగా నిట్టూర్చాడు.

"అలా దిగాలు పడకు. పుట్టిన ప్రతిజీవికీ మరణం తప్పదు. చావు ఇలా తెలిసి రావడం చాలా తక్కువ మంది విషయంలో జరుగుతుంది. ధైర్యవంతుడినంటు

న్నావు కాబట్టి ధైర్యంగా చావుకు సిద్ధపడు-" అంది మలయ.

*　　　*　　　*

"నేనెప్పుడో చచ్చిపోయాను...." అన్నాడు రామం. ఆపుకుందామన్నా ఆగకుండా అతని కళ్ళవెంబడి అశ్రు ధారలు కారుతున్నాయి.

ఇద్దరూ ఆటవిక యువతుల వద్ద ఆఖరి ముద్దు తీసుకున్నారు. ఈ జన్మకు తాము పొందబోతున్న ఆఖరి సుఖమది అని ఇరువురికీ తెలుసు. రాబోతున్న చావు భయంకరంగా ఉంది. ఆ ఆలోచన వారిని అన్ని సుఖాల నుంచీ దూరం చేస్తోంది.

వారికి చుట్టూ బాణాలు ధరించిన ఆటవిక యువకు లున్నారు. వారి బాణాలు ఈ ఇద్దరిమీదకు ఎక్కు పెట్ట బడి ఉన్నాయి.

ఇద్దరికీ మత్తుపానీయాలు అందించబడ్డాయి. కొద్ది సేపట్లోనా అతనూ,రామం బుట్టలో కూలబడి పోయారు.

వారికి స్పృహ వచ్చేసరికి ఇద్దరూ మృత్యులోయలో ఉన్నారు. అక్కడి పరిస్థితి అంతా రామేశం వర్ణించిన విధంగానే వుంది. అక్కడి వాసన భరించ శక్యం గాకుండ వుంది.

గుహువులు, రామం బెల్టులు విప్పారు. ఆ బెల్టులో వారొకపల్చటి గుడ్డను దాచారు. ఆ గుడ్డనుతీసి ముక్కుకు అడ్డుగా కట్టు కున్నారు. ఇప్పుడు వారికి దుర్గంధ సమస్య లేదు.

"ఒక సమస్య తీరింది కానీ...ఇలా ఎన్నాళ్ళు?'

అన్నాడు రామం.

"చాలా లోతున ఉన్నాం- ఎగిరి తప్పించుకోవడం సాధ్యంకాదు. ఏమైనా రహస్య మార్గాలున్నా యేమో వెదకాలి. అంతకుమించి వేరేదారిలేదు...." అన్నాడు గురువులు.

ఇద్దరూ చుట్టూఉన్న గోడను అణువణువూ శోధించారు. మృత్యులోయను ప్రకాశవంతంచేస్తున్న మణుల నైతే చూడగలిగారు కానీ రహస్య మార్గమేమీ వారికి గోచరించలేదు. రామేశం చెప్పినమాటలు గుర్తుచుకుని వాళ్ళు మణుల జోలికివెళ్ళలేదు.

తమ బుట్టలోని ఆహారాన్ని చూసుకున్నారు వాళ్ళు. ఇద్దరు మనుషులకు మూడు రోజులకు సరిపడ ఆహారముంది అందులో.

'పొదుపుగాతింటే ఇదేభోజనంతో ఆరురోజులు గడుపవచ్చు-" అన్నాడు రామం.

'ఎన్నాళ్లున్నా చావుతప్పదు. అందుకని నాదోసలహా. ఇద్దరం ఒక్కసారే చావడమెందుకు? నా ఆహారం కూడా నీకే వదిలేస్తాను. ఆ విధంగా నువ్వింకో ఆరురోజులు బ్రతుకవచ్చు- ఏమంటావు?" అన్నాడు గురువులు.

'అలా ఎందుకు?' అన్నాడు రాము ఆశ్చర్యంగా.

'మీ తాతగారికి నేను మాటిచ్చాను. నా కంఠంలో ప్రాణమున్నంత వరకూ నీ ప్రాణాలు కాపాడుతానని! ఇప్పుడు నీ గురించి నేను చేయగలిగినదింకేమీ లేదు. నా ఆహారాన్ని నీకు వదిలిపెట్టడం ద్వారా కనీసం నా మాట నిలిబెట్టుకున్న తృప్తి ఉంటుంది నాకు....'

అన్నాడు గురువులు.

"గురువులూ!" అన్నాడు రామం. అతనికి ఏడుపువచ్చింది- 'నువ్వు నాకు అన్నలాంటి వాడివి. ఏ పరిస్థితుల్లోనూ నిన్ను నేను వదులుకోలేను. ఇంత వరకు కలిసి వచ్చాం. మనం కలిసి జీవిద్దాం. కలిసి మర ణిద్దాం. అన్నీ సమంగా పంచుకుందాం. ఆహారంకూడా-' అన్నాడు రామం.

ఆఖరికి ఇద్దరూ కలిసి- ఆకలి వేసినప్పుడు కొంచెం కొంచెంగా తింటూ వీలైనన్నాళ్ళు ఆ ఆహారాన్ని దాచుకో వాలని నిర్ణయించారు. అయితే తమ కంత్యకాలం సమీ పించిందన్న నిరాశ ఇద్దరికీ కలిగింది.

మృత్యులోయలో ఒక రోజు గడిపారు. మర్నాడు లేవగానే గురువులు మళ్ళీ తన ప్రయత్నం కొనసాగిం చాడు. గోడలు పట్టుకుని పైకి పాకడానికి వీలుపడుతుందే మోనని అతడి ఆశ.

కానీ గోడలు నున్నగా ఉన్నాయి. అక్కడక్కడ రాళ్ళు పొడిగినట్లున్నప్పటికీ ఏవీ కదలడం లేదు. పట్టు దొరకడం లేదు. ఆ విధంగా బయట పడడం అసాధ్య మని అతను గ్రహించాడు.

తన వల్ల ఏమీ ప్రయోజనం లేదనీ గురువులు వల్లనే తను రక్షించబడాలనీ రామానికి తెలుసు. అందువల్ల అతను గురువులు చేసే ప్రతి ప్రయత్నమూ ఫలించాలని భగవంతుడ్ని ప్రార్థించుకుంటున్నాడు.

చూస్తూండగా మృత్యులోయలో ఐదు రోజులు గడి చాయి. ఆహారపదార్థాలు బాగా తరిగిపోయాయి. తమ

పరిస్థితి తల్చుకుంటూంటే రామానికి ఏడుపువస్తోంది.

గురుపులుకు కూడా క్రమంగా ధైర్యం నీళ్ళు కారి పోతోంది. అతను దిగులుగా రామం చేయిపట్టుకుని- 'చావంటే నాకు భయం లేదు. కానీ ఇలా చావాలని ఎన్నడూ అనుకోలేదు....' అన్నాడు.

ఇద్దరికీ ఇప్పుడు బాగా ఆకలి వేస్తోంది. ప్రస్తుతం మిగిలిన ఆహారపదార్థాలు ఏ ఒక్కరి ఆకలినీ తీర్చేవి కావు. వాటితో ఈరోజే గడవదు. తర్వాత ఏం చేయాలి?

రామం చేతులు పైకెత్తి- 'భగవంతుడా - మాకు తిన డానికి ఏమైనా పంపించు' అన్నాడు. గురువులు హేళనగా నవ్వి-'చూద్దాం ఆ భగవంతుడేమైనా పంపిస్తాడేమో-' అంటూ తల ఎత్తి పైకి చూసి ఆశ్చర్యపోయాడు. "రామం! అలా పైకి చూడు...." అన్నాడతను అప్రయత్నంగా!

రామం కూడా పైకి చూశాడు. ఆనందాశ్చర్యాలతో అతని ముఖం వెలిగింది.

పైనుంచి ఏదో వస్తువు క్రిందకు దిగుతోంది. దగ్గరపుతున్న కొద్దీ అది ఒకపెట్టెలా ఉంది. బాగా దగ్గరయ్యాక అది ఒక కర్రపెట్టె అని ఇద్దరూ గ్రహించారు. వాళ్ళు పక్కకు తప్పుకోగానే ఆ పెట్టె నేలకు అనుకుంది. ఇద్దరూ ఆ పెట్టెను సమీపించారు. అటవికులు తమ గురించి మరిన్ని ఆహారపదార్థాలు పంపి ఉంటారని ఇద్దరూ భావించారు.

ఆ పెట్టెమీద ఒక కాగితం అంటించిఉంది.- "ఇంకా మీరు జీవించిఉంటే ఈ పెట్టెలోని ఆహారపదార్థాలు

భరించండి. అప్పటికీ జీవించిఉంటే ఇదిక్కడ ఇంకొక్క రోజుఉంటుంది. అప్పుడు మీరీ పెట్టెలో కూర్చుని పైకి రావచ్చును....” అని వ్రాసిఉంది ఆ కాగితంమీద.

గురువులు అనుమానంగా- 'నాకు మలయ చెప్పింది. నేను ప్రమాదకరమైన మనిషినని ఆటవిక నాయకుడను కుంటున్నాడు. నన్ను నిశ్చయంగా అంతం చేయాలను కుంటున్నాడు. ఇందులో విషదార్థాలుండి ఉంటాయని నా అనుమానం-' అన్నాడు.

రామానికి బాగా ఆకలిగా ఉంది - “అలా ఎందుకను కోవాలి? ఆటవికులు అనాగరకులే గాని అమానుషంగా ప్రవర్తించరు. మనం ఆకలి బాధకు చావడం ఇష్టం లేక మంచి ఆహారం పంపి ఉంటారు. అనవసరపు టనుమానాలు పెట్టుకోవద్దు. అది విషభోజనం అనుకో -ఎలాగూ చస్తాం-ఆకలికి మాడిపోకుండా ఒక్క క్షణంలో ప్రాణం పోతుంది-”

“బహుశా ఆటవికుల ఉద్దేశ్యమూ అదే అయుంటుంది .... ” అన్నాడు గురువులు-“తేలికగా మన ప్రాణాలు పోతాయనే ఉద్దేశ్యంతో ఈపని చేసిఉంటారు. కొద్దిగా తెలివితేటలుపయోగిస్తే ఇప్పుడు మనం తప్పించుకుని బయట పడవచ్చు. ఇందులోని ఆహార పదార్థాలు మనం నోట బెట్టవద్దు. పెట్టెలోకి వెళ్ళి కూర్చుందాం. ఒకరోజు ఆకలిబాధ భరించామంటే మనం ప్రాణాలతో తప్పించుకోవచ్చు....”

ఆకలికి ఆగడం కష్టమనిపించినా రామానికి గురువులు మాటల్లో నిజముందని పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో

అది చాలా మంచి ఉపాయమని అతను గ్రహించాడు.

గురువులు పెట్టె తలుపులు తెరవబోయాడు. పెట్టె చాలా పెద్దదిగా ఉంది. పెట్టెపైన మేకులు కొట్టబడి ఉన్నాయి. దాని మీద కూర్చునేందుకు అవకాశం లేదు. పెట్టెకు ఓ పక్కగా తలుపులున్నాయి.

గురువులు తలుపులు తెరవబోతూండగా రామం 'హాచ్' అని తుమ్మాడు.

గురువులు ఆగిపోయాడు.

రామం ఆత్రుతగా గురువులు వంక చూసి 'తలుపులు తెరూ' అన్నాడు.

"నా మనసు కీడును శంకిస్తోంది. నీ తుమ్ము నాకు అపశకునం...." అన్నాడు గురువులు.

"ప్రాణాపాయ స్థితిలో ఉన్న మనకింకా భయమేమిటి?'

అయితే గురువులు తలుపులు తీయలేదు. 'నా సెంటిమెంటు నాది. సలసల మరిగే నూనెలో వేయిస్తానన్నా నా సెంటిమెంట్లు నేను వదలుకోలేను. కాసేపాగి తలుపు తీస్తాను...." అన్నాడు గురువులు.

'ఈలోగా కీడు పోతుందా?' అన్నాడు రామం.

'కీడు సంగతి నాకు తెలియదు. నా మనసు ధైర్యాన్ని పుంజుకోవడానికా వ్యవధి నాకు చాలా చాలా అవసరం' అన్నాడు గురువులు.

'నాకే సెంటిమెంట్లు లేవు. నేను వెళ్ళి తలుపు తీస్తాను...." అన్నాడు రామం.

"నీ ఇష్టం!" అన్నాడు గురువులు.

రామం విసురుగా వెళ్ళి పెట్టెతలుపు తీశాడు. అంతే,

నిలువెత్తు పెద్దపులి ఒకటి గాండ్రుమని అరుస్తూ పెట్టెలోంచి బయటకు దూకింది.

రాముం ప్రాణాలు పైనేపోయాయి. అతను పట్టుక్కన పెట్టెలోకి దూరి తలుపులు వేసుకున్నాడు.

• • •

"నమస్కారమండీ!" అన్నాడాయువకుడు.

"ఎవర్నువ్వు?"

"మీరు నాకో సాయంచేయాలి...."

'ఏమిటో చెప్పు...."

'గురువులు గురించి చెప్పాలి—'

గురువులు గురించి నాకేంతెలుసు?' అన్నాడతను.

'మీకు తెలుసు. బాగాతెలుసు. ఏదోపనికోసం మీరు గురువుల్ని జైలునుంచి తప్పించారు....'

'ఇంతకీ నువ్వెవరు?'

'నా పేరు ఈశ్వరి. అబ్బాయిని కాదు. అమ్మాయిని. గురువులూ నేనూ ప్రేమించుకున్నాం-' అన్నాడా యువకుడు.

అతను ఆశ్చర్యంగా యువకుడి వంక చూసి- 'నీ మాటల్లోనిజాన్ని నేను పరీక్షించు కోవచ్చా?'అన్నాడు.

'శ్రీ కృష్ణపరమాత్మ ఆ మాత్రం తెలుసుకోలేరా?' అని నవ్వింది ఈశ్వరి.

'గురువుల్ని నేను జైలునించి తప్పించానని ఎలా గనుకున్నావు?'

'నేను కొద్దికాలంగా గురువులున్న జైలుప్రాంతాలే తిరుగుతున్నాను. మీరు గురువుల్ని కలుసుకున్న రోజునే

అతను హాస్పిటల్‌కి వెళ్ళాడు. ఆ తర్వాత అక్కణ్నించి మాయమయ్యాడు ....' అంది ఈశ్వరి. శ్రీకృష్ణ పరమాత్మ జవాబుకోసం ఆమె చాలా ఆత్రుతగా ఎదురు చూస్తోంది.

"పోలీసులు కూడా ముందు అలాగే అనుకున్నారు. కానీ ఇప్పుడు వారు నిజం గ్రహించి నామీద నిఘా తగ్గించారు...." అన్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

"పోలీసులు నిఘా తగ్గించారు కానీ నేను తగ్గించలేదు. నేను పోలీసుల మనిషిని కాను. గురువులు మనిషిని. అతనికోసం నేను తపించిపోతున్నాను. అసలు వేషంలో బయటపడితే నన్నూ పోలీసులు పట్టుకుంటారు". అంది ఈశ్వరి.

"నన్ను నమ్మి ఇవన్నీ చెబుతున్నావు. నేను నిన్ను పోలీసులకు పట్టిఇస్తే ...."

"ఫరవాలేదు. గురువులు సంగతి తెలియకపోయాక నేను జైలుకుపోయినా బాధలేదు.''

"శభాష్-నువ్వు నాకు నచ్చావు...." అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ—"గురువు ఎక్కడున్నాడో నాకు తెలుసు. అక్కడికి చేరుకోవడం చాలాకష్టం. కానీ ధైర్యముంటే సాధ్యపడుతుంది. ప్రాణాలకు తెగించిన వాళ్ళే అక్కడికి వెళ్ళగలుగుతారు..."

"గురువుల్ని కలుసుకోవడం కోసం నేను దేనికైనా తెగిస్తాను....''

"అయితే విను...." అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ— "గంగాపురమనే గ్రామానికి సమీపంలో ఓ కొండ ఉంది,

ఆ కొండనుంచి సన్నవికాలిబాట ఉంది. ఆ బాట ఒక అరణ్యంలోకి దారితీస్తుంది. ఆ అరణ్యంలో ఒకచోట ఒక భయంకరాకారం ఎదురవుతుంది. అది నిజానికి ఒక బొమ్మ. ఆ బొమ్మ చేతితో ఒక మార్గాన్ని సూచిస్తూ ఉంటుంది. ఆ మార్గంలో వెడితే ఓ కొండగుహ వస్తుంది. ఆ కొండ గుహలోంచి బయల్దేరితే....ఒక శిధిలాలయానికి దారితీస్తుంది. ఆ శిధిలాలయంలో అపూర్వమైన నిధి ఉంది. దాన్ని సాధించడానికి వెళ్ళాడు గురువులు ...."

"ఒస్-ఇంతేగదా!" అంది ఈశ్వరి.

"ఇంతే అంటే చాలదు. హేమాహేమీలు ఆదారిన వెళ్ళి ప్రాణాలుకోల్పోయారు. ఎవ్వరూ ఇంతవరకూ ప్రాణాలతో తిరిగిరాలేదు. గురువులు కూడా వస్తాడని నాకు తోచదు...." అన్నాడు పరమాత్మ.

ఈశ్వరి కళ్ళలో రవంత భయం కనబడింది కానీ అంతలోనే తమాయించుకుని—"గురువులు అందరి లాంటి వాడుకాదు..." అంది

"ఆ ఆశతోనే గురువుల్ని పనికి పురమాయించాను. ఇంతవరకూ అతడివద్దనుంచి సమాచారంలేదు. ఏమయాడో తెలియదు...." అన్నాడు పరమాత్మ.

'నేనక్కడికి వెడతాను ....' అంది ఈశ్వరి.

'నిజంగానా?' అన్నాడు శ్రీకృష్ణ పరమాత్మ- 'నేనూ అక్కడికెవర్నయినా పంపాలని చూస్తున్నాను...,"

'నేనే వెడతాను....' అంది ఈశ్వరి.

'అక్కడికి వెళ్ళేమనిషి గురువుల్ని ప్రేమించేదయుండడం చాలా అవసరం. అందుకే నువ్వెళ్ళడం

నాకిష్టంగానే ఉంది....' అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

'నేనేం చేయాలో చెప్పండి!' అంది ఈశ్వరి.

'నీకు ఒక ట్రాన్స్‌మిటర్ ఇస్తాను. ఎప్పటికప్పుడు నీకు తెలిసిన సమాచారం నాకు చేరవేస్తుండు. ఇప్పుడున్న పురుషవేషంలోనే ఉండు. నీ మకాం అడవిలోనే ఉంటుంది. ఎవరికంటా బడకుండా ఉండడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా నువ్వీ దారిలో వెడుతున్నట్లు గంగాపురం గ్రామపౌరులకు తెలియకూడదు. వెయ్యి కళ్ళతో నీ పరిసరాలను గమనించు కుంటూ ఉండాలి.....' అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

'ఆ దొటకు కాపలా ఉండదా?'

"పెద్దగా ఉంటుందనుకోను. కానీ ఆ మార్గంలో అడుగు పెట్టినవాళ్ళు ప్రమాదాల్లో ఇరుక్కోక తప్పదు...' అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

'ఎందుకని?'

'అనిఖిని ఎవరో తెలియని మనుషులు వశపర్చుకున్నారని అనుమానం. ఆమనుషులు చాలాబలవంతులు. వాళ్ళెవ్వరో తెలుసుకోవడమే చాలా కష్టంగా ఉంది. వాళ్ళ ప్రాంతానికి చేరడంఇంకా కష్టంగాఉంది..... తెలివితేటలుంటేతప్ప వాళ్ళను సాధించడం కష్టం....'అన్నాడు పరమాత్మ.

'సరే-నేను బయల్దేరుతాను ...' అంది ఈశ్వరి.

'అలాకాదు. నీకు ఓ నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వాలి. రివాల్వర్ చేత్తోపట్టుకోవడం రావాలి. మనుషుల్నించి తప్పించుకునేందుకు కొన్ని ట్రిక్కులు తెలియాలి. అత్యవసర పరిస్థితుల్లో చేతుల్నుపయోగించి

ఎదుటి వాళ్ళని పడగొట్టే సులువు తెలియాలి. కొన్ని విపరీత పరిస్థితుల్లో కొందరు ఎలా తప్పించుకుంటారో సినిమాలు చూసి తెలుసుకోవచ్చు. అన్ని సదుపాయాలూ నా దగ్గరున్నాయి. నాలుగురోజుల శిక్షణ ముగిసిందంటే నువ్వు నాకే మస్కాకొట్టి పారిపోగలవు...."

"సరే అలాగే!' అంది ఈశ్వరి.

'పద-' అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ. ఈశ్వరి అతడి ననుసరించింది.

*　　*　　*

గంగాపురంసమీపం వరకూవచ్చి ఆగిపోయిందిఈశ్వరి.

పరమాత్మ చెప్పిన ప్రకారం తన గ్రామంలో అడుగిడకూడదు ఆమె జేబులోంచి మ్యాపు తీసింది. మ్యాపు చూసి స్థలాలనెలా గుర్తు పట్టాలో ఆ కృష్ణపరమాత్మ తనకు శిక్షణ ఇప్పించాడు.

ఆమె ఆ మ్యాప్‌ను జాగ్రత్తగా పరిశీలించి కొండ చేరుకుంది. అక్కడున్న కాళికాలయాన్ని సులభంగానే గుర్తించ గలిగింది. ఎక్కడా ఎవ్వరూ ఆమె కంటబడ లేదు. ధైర్యంగా ముందడుగు వేసిందామె.

సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడిచేక ఆమెకు భయంకరావతారం కనబడింది. అదిచూసి ఆమె ఏమాత్రం భయపడలేదు. ముందుగానే శ్రీకృష్ణపరమాత్మ హెచ్చరించడం వల్ల.

అయితే అతను చెప్పినట్లుగా ఆ బొమ్మ చేయి ఏ వైపూ చూపడంలేదు. రెండు చేతులూ పొట్టమీద వేసుకుని ఉన్నదా ఆకారం.